సాక్షి సిద్దిపేట

మంగళవారం । 9 । జూలై । 2024



చదువులో మేటి..

కుకునూరుపల్లి.. ప్రభుత్వ హైస్కూల్ చెందిన 12 మంది విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీ సీటు దక్కించుకున్నారు. వివరాలు 8లో ▸



కళాశాలల కోసం పోరాడుదాం

జిల్లాలో ట్రిపుల్ ఐటీ, మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని ఐఎస్‌యూ అధ్యక్షుడు నాగరాజు అన్నారు. వివరాలు 8లో ▸



సాగు లెక్క.. ఇక పక్కా..

సీజన్ల వారీగా వ్యవసాయ శాఖ పంటల నమోదు ప్రక్రియ (క్రాప్ బుకింగ్) చేపట్టింది.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

గౌరవెల్లి ప్రాజెక్టుకు వైఎస్సార్ పేరు పెట్టాలి

రెడ్డి జేఏసీ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ రెడ్డి



పండ్లు పంపిణీ చేస్తున్న మల్లికార్జున్ రెడ్డి

హుస్నాబాద్: తన పాదయాత్రలో భాగంగా ఈ ప్రాంత రైతాంగ బాధలను తెలుసుకొని శంకుస్థాపన చేసిన గౌరవెల్లి ప్రాజెక్టుకు దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేరు పెట్టాలని రెడ్డి జేఏసీ జిల్లా అధ్యక్షుడు అయిలేని మల్లికార్జున్ రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలో సోమవారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైఎస్సార్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజలకు దగ్గరయ్యారన్నారు. మన మధ్య లేకపోయినా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉన్నారన్నారు. ఆయన చేసిన సేవలు మరువలేవని కొనియాడారు.

'మహిళా శక్తి' మీసేవా కేంద్రాలు వద్దు



అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మీసేవా నిర్వాహకులు

సిద్దిపేటరూరల్: మహిళా శక్తి పథకం ద్వారా గ్రామాల్లో మీసేవా కేంద్రాలను నడపాలనుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని జిల్లా మీసేవా నిర్వాహకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 12 ఏళ్లుగా ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ మీసేవా కేంద్రాల నుంచి సేవలను అందిస్తున్నామన్నారు. మీసేవా సర్టిఫికెట్ స్టేషనరీ రూ. 1.10 పైసల నుంచి ఇప్పుడు రూ. 2.13 పైసలకు పెరిగిందని గుర్తుచేశారు. కానీ పదేళ్ల నుంచి కమీషన్ మాత్రం పెరగలేదన్నారు. కేంద్రాల అద్దె, ఇంటర్‌నెట్ బిల్లులు కూడా రెట్టింపు అయ్యాయన్నారు. దీనివల్ల భారం పడుతోందన్నారు. పహాణీ 1బీ వంటి సేవలను తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మీసేవా ఆపరేటర్ల రాష్ట్ర అధ్యక్షుడు గందె నాగరాజు, నగేశ్, శ్రీకాంత్, భరత్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో వేలం పాటలు

తలనీలాలు, కొబ్బరి ముక్కలు సేకరణ, ఇతర టెండర్ల వాయిదా

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో సోమవారం బహిరంగ వేలంపాటలు ఈఓ బాలాజీ శర్మ ఆధ్వర్యంలో జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి వ్యక్తులు భారీగా తరలివచ్చారు. పాదరక్షలు, బ్యాగులు భద్రపరుచుకునే హక్కు కోసం పి.నవీన్ రూ 14.90 లక్షలకు టెండర్ దక్కించుకున్నారు. కొబ్బరి ముక్కలు, తలనీలాలు, ఎల్లమ్మ ఆలయం వద్ద కొబ్బరి కాయల విక్రయం, స్వామి వారి బట్టలు, ఒడిబియ్యం బండారి సేకరణ, మొక్కుబడి వస్త్రాలకు సరైన పాట రాకపోవడంతో టెండర్లు వాయిదా వేశారు. తిరిగి ఈనెల 19న నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు గంగా శ్రీనివాస్, బుద్ధి శ్రీనివాస్, ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, ఆలయ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో హవేళిఘణాపూర్ ఎస్‌ఐ

మధ్యవర్తి ద్వారా రూ. 20 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం

హవేళిఘణాపూర్: అక్రమ ఇసుక తరలిస్తూ పట్టుబడిన టిప్పర్‌ను వదిలిపెట్టేందుకు మధ్యవర్తి ద్వారా రూ. 20 వేల లంచం తీసుకుంటున్న హవేళిఘణాపూర్ ఎస్‌ఐని సోమవారం ఏసీబీ అధికారులు ట్రాప్‌చేసి పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ పట్టణానికి చెందిన పూల గంగాధర్ టిప్పర్ ఈ నెల 29న ఇసుక తరలిస్తూ పట్టుబడింది. విడిపించేందుకు ఎస్‌ఐ ఆనంద్ గౌడ్ రూ. 50 వేలు డిమాండ్ చేయగా రూ. 20 వేలకు ఒప్పందం కుదిరింది. ఈ కేసులో మెదక్‌కు చెందిన పూల గంగాధర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. సోమవారం మధ్యవర్తి మస్తాన్ స్థానిక పెట్రోల్ బంక్ వద్దకు వచ్చి డబ్బులు ఎస్‌ఐకు ఇస్తుండగా పట్టుకున్నారు. ఆ మేరకు విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏసీబీ సిబ్బంది రమేశ్, వేణు పాల్గొన్నారు.

షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పేరుతో మోసం

రూ.80.60 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు



సిద్దిపేటకమాన్: గుర్తు తెలియని వ్యక్తి పంపిన లింకు ద్వారా స్టాక్ మార్కెట్‌లో భారీ పెట్టుబడి పెట్టి పోగొట్టుకున్న సంఘటన సిద్దిపేట జిల్లా సిద్దిపేట పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి స్టాక్ మార్కెట్ పేరుతో ఓ లింకును పంపించాడు. అందులో పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని చెప్పగా అతడి మాటలు నమ్మిన బాధితుడు పెట్టుబడి పెట్టగా మొదట్లో ఎక్కువ లాభాలు వచ్చాయి. అదే ఆశతో బాధితుడు 20 రోజుల క్రితం సైబర్ కేటుగాడు పంపిన లింకు ద్వారా నీఫరో కేర్ ఇండియా ప్రైవేటు ఇండియా లిమిటెడ్‌లో షేర్స్ కొనడానికి రూ. 80,60,000 పెట్టుబడి పెట్టాడు. రెండు, మూడు రోజుల తర్వాత లింకు ఓపెన్ చేసి చూడగా బ్లాక్ చేసి ఉండటంతో అనుమానంతో బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. అలాగే బాధితుడు సిద్దిపేట సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేయగా ఏసీపీ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. అధికారులు స్పందించి వెంటనే సైబర్ కేటుగాడి బ్యాంక్ ఖాతాలో ఉన్న రూ.11,00,010 ఫ్రీజ్ చేసినట్లు తెలిపారు.

● శ్రమైక జీవన సౌందర్యం



ఆకాశంలో సగం.. అవనిలో సగం అన్న చందంగా మహిళలు పురుషులతో సమానంగా పోటీ పడుతున్నారు. కుటుంబ పోషణకు తమ వంతుగా అండగా ఉంటున్నారు. ప్రస్తుతం పల్లెల్లో వ్యవసాయ పనులు జోరందుకోగా వరినాట్లు వేసే పనుల్లో మహిళలు నిమగ్నమయ్యారు. సిద్దిపేట జిల్లా తొగుట మండల ఎల్లారెడ్డిపేట గ్రామశివారులో ఈ దృశ్యం ఆవిష్కృతమైంది.

- కె.సతీశ్, సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

మార్కెట్ పదవులపై ఆశలు

చైర్మన్ పదవుల కోసం ఆశావహుల ప్రయత్నాలు

- పాత రిజర్వేషన్‌లే అమలు
- పార్టీలో మొదటి నుంచి ఉన్న వారికి ప్రాధాన్యత
- ప్రతిపాదనలు చేస్తున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జిలు
- 14 వ్యవసాయ మార్కెట్‌లుండగా.. ఇప్పటి వరకు గజ్వేల్ మార్కెట్ కమిటీ నియామకం కోసం ప్రతిపాదనలు



సిద్దిపేట వ్యవసాయ మార్కెట్

సాక్షి, సిద్దిపేట: కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నేతలు నామినేట్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. లోక్‌సభ ఎన్నికలు ముగియడంతో కొత్త పాలకవర్గాలను నియమించేందుకు అధికార పార్టీ కసరత్తు ప్రారంభించారు. జిల్లాలో 14 మార్కెట్ కమిటీలకు సంబంధించి రిజర్వేషన్‌లు గతంలో ఉన్నవే కొనసాగిస్తున్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్ పదవులు దక్కించుకునేందుకు అధికార పార్టీ నేతలు తన సీనియర్లను కలిసి కోరుతున్నారు. జిల్లాలో ఆయా నియోజకవర్గాల నుంచి గెలుపొందిన, ఓటమి చెందిన నేతల ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. దీంతో ఆశావహులు తమ ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు.

ఇన్‌చార్జి మంత్రికి దరఖాస్తులు

కాంగ్రెస్ పదేళ్ల తర్వాత అధికారంలోకి రావడంతో నామినేట్ పదవులపై ఎంతగానో ఆశపెట్టుకున్నారు. పార్టీకి సేవలు అందించే వారిని గుర్తించాలని ఇప్పటికే పార్టీ అధిష్టానం స్పష్టం చేసింది. ఎమ్మెల్యే ఉన్న చోట వారు.. లేనిచోట నియోజకవర్గ ఇన్‌చార్జిలు ప్రతిపాదిస్తున్నారు. ఆయా దరఖాస్తులను జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ ఆమోదంతో మార్కెటింగ్ శాఖకు సిఫారసు చేస్తున్నారు. జిల్లా మార్కెటింగ్ శాఖ పరిశీలించి రాష్ట్ర మార్కెటింగ్ శాఖకు ప్రతిపాదనలు పంపిస్తోంది. ప్రభుత్వం ఆమోదంతో నియామక ఉత్తర్వులు జారీ కానున్నాయి. జిల్లాలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ముగ్గురు బీఆర్‌ఎస్‌కు చెందిన ఎమ్మెల్యేలు ఉండటంతో క్షేత్రస్థాయిలో కాంగ్రెస్‌ను మరింత పటిష్టం చేసేందుకు బలమైన నేతలకు పదవులు ఇవ్వాలని అధిష్టానం నిర్ణయించినట్లు తెలిసింది. ఇప్పటి వరకు జిల్లాలో 14 మార్కెట్‌లకు గాను గజ్వేల్ మార్కెట్ కమిటీ నియామకం కోసం ప్రతిపాదనలు జిల్లా మార్కెటింగ్ శాఖకు చేరినట్లు సమాచారం. గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా జగదేవ్‌పూర్ మండలం గొల్లపల్లికి చెందిన వంటేరు నరేందర్ రెడ్డి పేరుతో పాటు 13 మంది డైరెక్టర్‌ల పేర్లను ప్రతిపాదనలు పంపినట్లు తెలుస్తోంది. త్వరలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

మార్కెట్ పేరు	రిజర్వేషన్
సిద్దిపేట	జనరల్(మహిళ)
చిన్నకోడూరు	జనరల్
నంగనూరు	జనరల్
తొగుట	జనరల్
కొండపాక	జనరల్
మిరుదొడ్డి	జనరల్(మహిళ)
దుబ్బాక	జనరల్
బెజ్జంకి	జనరల్
హుస్నాబాద్	జనరల్
కొహెడ	ఎస్సీ(మహిళ)
గజ్వేల్	జనరల్
చేర్యాల	బీసీ(మహిళ)
వంటిమామిడి	ఎస్సీ(మహిళ)

ప్రతీ మార్కెట్ కమిటీలో 18 మందితో పాలకవర్గం

తెలంగాణ మార్కెట్ చట్టం 1966 సెక్షన్ 5(1) ప్రకారం 18 మంది సభ్యులతో పాలకవర్గం ఏర్పాటు చేయాలి. ఇందులో మార్కెట్ కమిటీ పరిధిలో ఉండే 12 మంది రైతులు ఉండాలి. దీంతోపాటు వ్యవసాయ అనుబంధ రంగాల నుంచి కనీసం ఐదుగురు సభ్యులు ఉండాలి. వీరిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలు ఉండాలి. మార్కెట్ పరిధిలో లైసెన్స్ పొందిన వ్యాపారులు ఇద్దరు, సహకార సంఘాల నుంచి ఒకరు, మార్కెట్ పరిధిలోని గ్రామ సర్పంచ్ లేదా పురపాలక సంఘ చైర్మన్‌లలో ఒకరు సభ్యులుగా ఉంటారు. 18 మందితో కూడిన పాలక వర్గాన్ని ఏర్పాటు చేసి ఇన్‌చార్జి మంత్రి సురేఖ ఆమోదంతో జిల్లా మార్కెటింగ్ శాఖకు పంపిస్తారు. అక్కడి నుంచి రాష్ట్ర మార్కెటింగ్ శాఖకు పంపించినంతరం ప్రభుత్వం ఉత్తర్వుల ద్వారా పాలక వర్గాన్ని నియమిస్తారు.

ఇంటింటా ఇన్నోవేటర్

- నూతన ఆవిష్కరణలకు సిద్దిపేట వేదిక కావాలి
- ఇంటింటా ఇన్నోవేటర్ పోస్టర్ ఆవిష్కరణలో కలెక్టర్ మనుచౌదరి



ఇంటింటా ఇన్నోవేటర్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి

సిద్దిపేటరూరల్: నూతన ఆవిష్కరణలకు సిద్దిపేట జిల్లా వేదిక కావాలని కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ఆకాంక్షించారు. సోమవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంలో భాగంగా పోస్టర్‌ను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. ఇంటింటా ఇన్నోవేషన్‌లో భాగంగా జిల్లాలోని ప్రతి ఇంటి నుంచి నైపుణ్యం కలిగిన వారు నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టి ఇన్నోవేటర్‌గా మారాలన్నారు. చదువు, వయసుతో పని లేదన్నారు. విద్యాశాఖతోపాటు పలు శాఖల అధికారులు పాఠశాలల్లో, గ్రామాల్లో కార్యక్రమంపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుత సంవత్సరంలో జిల్లాలోని గ్రామీణ, పట్టణ ఔత్సాహికులు తమ ఆవిష్కరణలను ప్రదర్శించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. ఆగస్టు 15న జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రదర్శిస్తామన్నారు. ఎవరైనా ఆవిష్కరణలు చేయదలచిన వారు రెండు నిమిషాల వీడియో, నాలుగు ఫొటోలు, 100 పదాలతో ఆవిష్కరణకు సంబంధించిన వివరాలు రాసి తెలంగాణ ఇన్నోవేషన్ వాట్సాప్ నంబర్ 91006–78543కు పంపాలని సూచించారు. వృత్తి, ఊరు పేరు, జిల్లా పేరు వివరాలతో ఆగస్టు 5 లోగా పంపించాలని పేర్కొన్నారు. సిద్దిపేట ఆర్డీఓ సదానందం, ఈడీఎం ఆనంద్, మున్సిపల్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

జీపీ కార్మికుల ముట్టడి ఉద్రిక్తం

- బారికెడ్లు తోసుకుని కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు యత్నం
- అడ్డుకున్న పోలీసులతో వాగ్వాదం
- కలెక్టర్ హామీతో విరమణ

సిద్దిపేటరూరల్: జిల్లావ్యాప్తంగా 10 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ, గ్రామ పంచాయతీ కార్మికులు సోమవారం కలెక్టరేట్ ముట్టడి నిర్వహించారు. అందులో భాగంగా నాయకులు, కార్మికులు కలెక్టరేట్ వద్ద ఉన్న బారికెడ్లను తోసుకుని లోపలికి వెళ్లేందుకు యత్నం చేశారు. వారిని పోలీసులు అడ్డుకున్నారు. కొంతసేపు ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో కలెక్టర్ మనుచౌదరి జోక్యం చేసుకొని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించి విరమించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు నందబోయిన ఎల్లయ్య, జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ మాట్లాడారు. జిల్లాలో 499 పంచాయతీల్లో 2,500 మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. 10 నెలల నుంచి జీతాలు రాక ఇబ్బందులు పడుతూ అప్పులు చేస్తున్నారన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. రూ.5 లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేయాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేసి పాత కేటగిరీలను కొనసాగించాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకుంటే జిల్లా వ్యాప్తంగా సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి తునికి మహేశ్, యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొమురయ్య, కోశాధికారి రాజనర్సు, కార్మికులు శంకరయ్య, రాజమల్లు, మల్లయ్య, సమ్మయ్య, నరసింహులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎంసెట్ కౌన్సెలింగ్

నంగునూరు(సిద్దిపేట): ఇంజినీరింగ్ ప్రవేశాల కోసం రాజగోపాల్‌పేట పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న కౌన్సెలింగ్‌కు సోమవారం 474 మంది విద్యార్థులు హాజరయ్యారు. అధికారులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలించి లాగిన్ ఐడీ, పాస్ వర్డ్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ మరో రెండు రోజులు గడువు ఉందని కౌన్సెలింగ్ కోసం స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. లాగిన్ ఐడీ పొందిన వారు కాలేజీ కోసం ఆప్షన్లు పెట్టుకోవాలన్నారు.

సమస్యలను పరిష్కరించండి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి, అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ తదితరులు

- అధికారులకు కలెక్టర్ మనుచౌదరి ఆదేశం
- ప్రజావాణిలో 31 అర్జీల స్వీకరణ

సిద్దిపేటరూరల్: జిల్లాలోని పలు గ్రామాల నుంచి ప్రజలు వచ్చి ఇచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా ఆయన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు వారి సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రజావాణికి వస్తారన్నారు. వారి నమ్మకాన్ని కాపాడేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపి అర్జీలను వెంటనే పరిష్కరించాలన్నారు. పలు రకాల సమస్యల పరిష్కారం కోరుతూ 31 దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు గరీమా అగర్వాల్, శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్‌డీఏ జయదేవ్‌ఆర్యా, డీఆర్‌ఓ నాగరాజమ్మ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్జీదారుడితోపాటు ఒక్కరికే అనుమతి..

జిల్లాలోని పలు గ్రామాల నుంచి వారి సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణికి వచ్చే అర్జీదారుడు, అతడికి సహాయకారినే కార్యాలయంలోకి అనుమతించారు. అర్జీ పత్రం మినహా ఎలాంటి వస్తువులు పోలీసులు లోపలికి అనుమతించలేదు.

పూర్తి ప్యాకేజీని అందించాలి



నా పేరు తొట్ల నర్సింగం. నాది చిన్నకోడూరు మండలం ఎల్లాయపల్లి గ్రామం. అంతగిరి ప్రాజెక్టులో భాగంగా మాకు సంబంధించిన ఆస్తులు ముంపునకు గురయ్యాయి. ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో మాకు డబుల్ బెడ్రూం మాత్రమే కేటాయించారు. ఇంకా రావాల్సిన నష్టపరిహారం పూర్తిస్థాయిలో అందించలేదు. అధికారులను అడిగితే అంతగిరి ప్రాజెక్టు సిరిసిల్ల జిల్లా పరిధిలో ఉంటుందని మాకు ఎలాంటి సంబంధం లేదని చెబుతున్నారు. సిరిసిల్ల జిల్లా అధికారులను అడగగా రెవెన్యూ సిద్దిపేట జిల్లా పరిధిలో ఉంటుదంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మాకు ప్రభుత్వం ద్వారా అందించాల్సిన పూర్తి ఆర్అండ్ఆర్ ప్యాకేజీని అందించాలి.

– తొట్ల నర్సింగం

జిలెటిన్ స్టిక్స్ పెట్టారు.. కనెక్షన్‌లు తీసేశారు!

జిలెటిన్ స్టిక్స్‌లు ఎప్పుడు పేలుతాయోనని పందిల్ల వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా బండరాళ్ల బ్లాస్టింగ్ చేసేందుకు ఏర్పాటు చేసి కనెక్షన్‌లు తీసి వేశారు. కానీ పేలుడు పదార్థాలు ఇక్కడే వదిలిపెట్టారు. దీంతో ప్రాణభయంతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. అధికారులు వాటిని గురించి పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- జాతీయ రహదారి పనులతో ప్రమాద ఘంటికలు
- బండరాళ్లు పగులగొట్టేందుకు పెట్టిన పేలుడు పదార్థాలు
- 15 రోజులైన బ్లాస్టింగ్ చేయని అధికారులు
- భయాందోళనలో పందిల్ల వాసులు



బండలను బ్లాస్టిక్ చేసేందుకు పెట్టిన జిలెటిన్ స్టిక్స్‌లను చూపిస్తున్న స్థానికులు

హుస్నాబాద్: మండలంలోని పందిల్లలో జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయి. ఇళ్ల ఎదుట డ్రైనేజీ నిర్మాణం కోసం కాల్వ తవ్వారు. నాలుగు గృహాల ఎదుట వచ్చిన పెద్ద పెద్ద బండరాళ్లను యంత్రాలతో పగులగొట్టె ప్రయత్నం చేసినా ఫలించలేదు. దీంతో బ్లాస్టింగ్ చేయాలని నిర్ణయించారు. 100కు పైగానే జిలెటిన్ స్టిక్స్ పెట్టి కనెక్షన్లు తీసేశారు. 15 రోజులు గడుస్తున్నా బ్లాస్టింగ్ చేయకుండా వదిలేశారు. నిత్యం స్థానికులు భయం గుప్పిట్లో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఎవరైన అగ్గిపుల్ల వేసినా, సిగిరేట్ కాల్చి వేసినా, ఎండవేడిమికి కూడా పేలే ప్రమాదం ఉందని భయభ్రాంతులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపిల్లలను బయటకు రానివ్వకుండా కాపాలాగా ఉంటున్నారు. వాటి వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ఇళ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. వారి అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. పనులకు వెళ్దామంటే ఎక్కడ పేలుతాయన్న భయంతో పిల్లలను విడిచి వెళ్లలేకపోతుమని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మా పరిస్థితి ఏంటీ?

మురుగు కాలువల కోసం కందకాలు తీశారు. మా ఇళ్ల ఎదుట పెద్ద బండరాళ్లు బయటపడ్డాయి. వాటిని పగులగొట్టడానికి జిలెటిన్ స్టిక్స్ పెట్టారు. వాటిని పేల్చకుండా విడిచిపెట్టారు. ఎవరైనా పొరబాటున అగ్గిపుల్ల వెలిగిస్తే మా పరిస్థితి ఏంటీ?

పొలవేని రైనా, పందిల్ల

పేలితే బాధ్యత ఎవరిది

ఇళ్ల ఎదుట పెట్టిన జిలెటిన్ స్టిక్స్ పేలితే బాధ్యత ఎవరిది. బండ తీసేస్తామని వాటికి పెట్టిన కనెక్షన్లు తీసేశారు. పనులకు పోకుండా ఇంటి వద్దే ఉంటున్నాం. ఇవి పెట్టినోళ్లు తీసి వేయలేదు. పైగా పేల్చలేదు. ఎండవేడిమికి పేలితే పెద్ద ప్రమాదం పొంచిఉంది.

తాటికొండ స్వరూప, పందిల్ల

క్లుప్తంగా

ఒలంపియాడ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులు

సిద్దిపేటజోన్: గతేడాది డిసెంబర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి ఇండియన్ ఒలంపియాడ్ పోటీల్లో సిద్దిపేట అంబిటస్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. మూడు రాష్ట్ర స్థాయి ర్యాంక్‌లు, ఆరు ఎక్సలెన్స్ అవార్డులతో మొత్తంగా 50 మంది విద్యార్థులు మెడల్స్ సాధించారు. పాఠశాల నుంచి 232 మంది హాజరు కాగా వీరిలో 158 మంది రెండో రౌండ్‌కు ఎంపిక అయ్యారు. నీరజ్, రక్షిత, సూర్య ప్రకాశ్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ర్యాంక్‌లు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన అంబిటస్‌కు గోల్డెన్ స్కూల్ అవార్డు లభించింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ జ్యోతి విద్యార్థులను అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఖేడ్ విద్యార్థులు ఎంపిక


రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినులు

నారాయణఖేడ్: నారాయణఖేడ్‌కు చెందిన విద్యార్థినులు ఫుట్‌బాల్ పోటీల్లో గెలుపొంది రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఉమ్మడి మెదక్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెదక్‌లోని ఇందిరాగాంధీ స్టేడియంలో సోమవారం ఉమ్మడి జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాలికల విభాగం ఫుట్ బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఖేడ్‌కు చెందిన ఈ- తక్షిల పాఠశాలకు చెందిన సారిక, సాయిస్ఫూర్తి, రాగప్రియ, కృష్ణవేణి ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు కల్వకుర్తిలో రాష్ట్రస్థాయి పోటీలు జరగనున్నాయి. విద్యార్థినులను పాఠశాల కరస్పాండెంట్ శరత్ కుమార్, పీఈటీ శ్రీనాథ్ అభినందించారు.

తల్లి విధుల్లో కూతురు

అంగన్‌వాడీ టీచర్‌గా పదేళ్ల బాలిక


విధులు నిర్వహిస్తున్న బాలిక

అల్లాదుర్గం(మెదక్): పదేళ్లకే ఉద్యోగం అంటే విచిత్రమే. ఓ అంగన్‌వాడీ కేంద్రంలో పదేళ్ల బాలిక అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహించింది. ఈ సంఘటన అల్లాదుర్గం మండలం సీతానగర్ తండాలో కనిపించింది. వివరాల్లోకి వెళ్తే.. సీతానగర్ తండాలోని అంగన్‌వాడీ కేంద్రానికి సాక్షి వెళ్లగా అక్కడ పదేళ్ల బాలిక విధులు నిర్వహిస్తూ కంటబడింది. ఈ విషయంపై ఆరా తీయగా, అంగన్‌వాడీ టీచర్ కేంద్రం తెరిచి ఇంటికి వెళ్లింది. వ్యవసాయ పనులు ఉండటంతో టీచర్ కూతురును కేంద్రానికి పంపింది. దీంతో బాలిక అంగన్‌వాడీ టీచర్‌గా విధులు చేపట్టింది. అంగన్‌వాడీ కేంద్రంలో నలుగురు చిన్నారులు మాత్రమే ఉన్నారు.

చదువులో మేటి..

అందింది ట్రిపుల్ ఐటీ

- బాసర ట్రిపుల్ ఐటీకి 12 మంది విద్యార్థులు
- ఒకే పాఠశాల నుంచి ఎంపిక
- పదిలోనూ వరుస శత శాతాలు
- ఆదర్శంగా నిలుస్తున్న కుకునూరుపల్లి హైస్కూల్


కుకునూరుపల్లి హైస్కూల్ భవనం

కొండపాక(గజ్వేల్): ప్రతిభకు పేదరికం, కుటుంబంలోని కష్టాలు అడ్డురావని నిరూపించారు కుకునూరు పల్లి హైస్కూల్ విద్యార్థులు. ఒకే పాఠశాల నుంచి ఏకంగా 12 మంది విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించి ఔరా అనిపించారు. ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కష్టపడి చదివి, ఇంజనీరింగ్‌లో రాణించేందుకు బంగారు భవిష్యత్ బాటు వేసుకున్నారు.

కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్లో 12 మంది విద్యార్థులు బాసరలోని ట్రిపుల్ ఐటీలో సీటు దక్కించుకొని హైస్కూల్ పేరు ఆదర్శంగా నిలిచారు. 2017–18 సంవత్సరం నుంచి 2023–24 వరకు 10వ తరగతిలో 4 సార్లు 100 శాతం ఉత్తీర్ణతను సాధిస్తూ వస్తున్నారు. 1983 సంవత్సరంలో 10వ తరగతిగా ఏర్పడింది. మండలంలో అత్యధిక విద్యార్థులున్న పాఠశాలగా పేరును నమోదు చేసుకుంటున్న తీరుగా పదిలో మంచి ఉత్తీర్ణతను సాధిస్తూ పేరు ప్రఖ్యాతులు రాణించేలా తాజా మాజీ సర్పంచ్ పొల్కంపల్లి జయంతి, భర్త నరేందర్ సొంత ఖర్చులతో మౌలిక వసతులు కల్పించారు. పాఠశాల భవనం రూపు రేఖలు పూర్తిగా మార్చేశారు. ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొనేందుకు మొక్కలు నాటుతూ ఒక్కొక్క మొక్క ఒక్కొక్క విద్యార్థికి దత్తత ఇచ్చారు. విద్యాపరంగా లోటుపాట్లు ఉండకుండా చూసుకుంటూ వచ్చారు. ప్రస్తుతం హైస్కూల్లో 398 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. వరుస రెండేళ్లుగా 100 శాతం ఉత్తీర్ణతను సాధిస్తూ వస్తుంది. 2023–24 సంవత్సరంలో 70 మంది విద్యార్థులు 10వ తరగతిలో పరీక్షలు రాయగా 70 మంది పాసై 100 శాతం ఉత్తీర్ణతను దక్కించుకున్నారు. వీరిలో 12 మంది విద్యార్థులు నిజామాబాద్ జిల్లాలోని బాసరలోని ట్రిపుల్ ఐటీలో సీట్లను దక్కించుకున్నారు. ఒకేసారి 12 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో చోటు దక్కించుకోవడం పట్ల గ్రామస్తులు ఉపాధ్యాయులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో..



ప్రతీ రోజు 10వ తరగతిలో 10 జీపీఏ రావడానికి ఉపాధ్యాయులు చాలా ప్రోత్సాహం అందించారు. దీన్ని లక్ష్యంగా చేసుకొని ముందుకు పోయాను. ఎలాంటి సందేహాలు ఉన్నా నివృత్తి చేసేవారు. ట్రిపుల్ ఐటీలో సీటు దక్కడం సంతోషంగా ఉంది.

– స్రవంతి, ట్రిపుల్ ఐటీ విద్యార్థిని

ప్రత్యేక తరగతులు దోహదపడ్డాయి



10వ తరగతిలో 10 జీపీఏను సాధించేందుకు ప్రత్యేక తరగతుల నిర్వహణపై శ్రద్ధ పెట్టాను. అర్థంకాని సబ్జెక్టును అడిగి తెలుసుకున్నాను. దీనికితోడు తల్లిదండ్రులు మరింత ప్రోత్సాహం ఇవ్వడంతో ట్రిపుల్ ఐటీలో సీటు రావడానికి తోడైంది. ప్రత్యేక తరగతులు చాలా దోహదపడ్డాయి. నాతో పాటు ఇంకొంత మంది విద్యార్థులు కూడా ట్రిపుల్ ఐటీకి ఎంపియ్యారు.

– అజయ్, ట్రిపుల్ ఐటీ విద్యార్థి

విద్యతోనే గ్రామాభివృద్ధి



విద్యతోనే గ్రామాభివృద్ధి సాధ్యంగా భావించి పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాం.ప్రభుత్వ నిధులకు ఆశపడకుండా సొంత ఖర్చులతో మోడల్ హైస్కూల్ భవనాన్ని తయారు చేశాం. దీనికి తోడుగా మంచి నీటి వసతి, బాత్ రూంలు, లైబ్రరీని ఏర్పాటు చేశాం.

– పొల్కంపల్లి జయంతి, మాజీ సర్పంచ్

12 మందికి సీట్లు దక్కాయి



10వ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు మెరుగైన బోధనలు అందేలా చూశాం. ప్రత్యేక తరగతులకు విద్యార్థులు గైర్హాజరు కాకుండా చర్యలు తీసుకున్నాం. ఉపాధ్యాయుల, తల్లిదండ్రుల, స్థానిక ప్రజాప్రతినిధుల సహాయ సహకారాలతో 12 మంది విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో చోటు దక్కింది.

– సత్తయ్య, ప్రధానోపాధ్యాయుడు

కళాశాలల కోసం కలిసి పోరాడుదాం

- జిల్లాలో ట్రిపుల్ ఐటీ, మహిళా ఇంజనీరింగ్ కాలేజీలు ఏర్పాటు చేయాలి
- ఐఎస్‌యూ జాతీయ అధ్యక్షుడు నాగరాజు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐఎస్‌యూ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలో ట్రిపుల్ ఐటీ, మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు దిశగా ప్రతీ ఒక్కరం కలిసి పోరాడుతామని, ఇండియన్ స్టూడెంట్ యూనియన్ జాతీయ అధ్యక్షుడు పావని నాగరాజు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఈ మేరకు పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం నాగరాజు మాట్లాడుతూ.. కేవలం బాసరలో మాత్రమే నిర్వహిస్తున్న ట్రిపుల్ ఐటీని ఉమ్మడి జిల్లాల్లో కేటాయించి, విద్యార్థులకు లబ్ధి చేకూర్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా సిద్దిపేటలో మహిళా ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు. దీంతో ఈ ప్రాంత విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఏపీలో నాలుగు ట్రిపుల్ ఐటీలు ఉన్నాయని, తెలంగాణలో కేవలం ఒక్కటే ఉందని, దీంతో ట్రిపుల్ ఐటీలో చేరాలనుకునే విద్యార్థులకు నిరాశే మిగులుతుందన్నారు. పేద విద్యార్థులకు లబ్ధి చేకూర్చే విధంగా విద్యారంగలో మార్పులు తీసుకురావాలన్నారు. అన్ని జిల్లాల్లో ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న విద్యార్థులు నాణ్యత ప్రమాణాలు, సౌకర్యాలు, ప్రతిభావంతులను తయారుచేసే ఇంజనీరింగ్ కాలేజీలు లేకపోవడంతో ప్రైవేట్ రంగం వైపునకు విద్యార్థులు వెలుతున్నారన్నారు. అందుకే గ్రామీణ, పట్టణ, నగర ప్రాంత ప్రజలు ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాల వైపు వెళ్లకుండా ప్రభుత్వం ట్రిపుల్ ఐటీలను, ఇంజనీరింగ్ కళాశాలలను విరివిగా ఏర్పాటు చేయాలన్నారు. విద్యారంగానికి బడ్జెట్‌లో సముచిత నిధులు కేటాయించాలన్నారు. పార్టీలు, సంస్థలను పక్కకు పెట్టి, సిద్దిపేటలో ట్రిపుల్ ఐటీ, మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు దిశగా ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, హరీశ్ గౌడ్, రాకేశ్ పాల్గొన్నారు.

ఎస్ఐది కుల దురహంకార హత్య

రాష్ట్ర మాల మహానాడు పొలిట్ బ్యూరో చైర్మన్ ర్యాకం శ్రీరాములు


మాట్లాడుతున్న శ్రీరాములు

మిరుదొడ్డి(దుబ్బాక): భద్రాద్రి కొత్త గూడెం జిల్లా అశ్వారావుపేట ఎస్ఐ శ్రీరాములు శ్రీను ఆత్మహత్య ముమ్మాటికీ కుల దురహంకార హత్యగా పరిగణిస్తున్నామని, అందుకు కారణమైన సీఐ జితేందర్‌రెడ్డితోపాటు, పోలీస్ సిబ్బందిని విధుల నుంచి తొలగించి కఠినంగా శిక్షించాలని తెలంగాణ రాష్ట్ర మాల మహానాడు పొలిట్ బ్యూరో చైర్మన్ ర్యాకం శ్రీరాములు, ఇంటర్నేషనల్ అంబేడ్కర్ సేవా సమితి రాష్ట్ర ఇన్‌చార్జి భూంపల్లి భీంరావు డిమాండ్ చేశారు. మంగళవారం అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ.. న్యాయాన్ని కాపాడాల్సిన పోలీస్ వ్యవస్థలో కుల వివక్షత నెలకొనడం రాజ్యాంగానికి గొడ్డలి పెట్టులాంటిదన్నారు. ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌పై అనునిత్యం అవమానిస్తూ, ఇబ్బందులకు గురి చేస్తూనే విధి నిర్వహణలో ఆటంకాలు సృష్టిస్తూ చివరికి ఆత్మహత్యకు పురిగొలిపేలా చేసిన సీఐ, పోలీస్ సిబ్బందిని కఠినంగా శిక్షించాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న శ్రీనివాస్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకొని వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతో పాటు రూ. కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో మాల మమానాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మండల యాదగిరి, మోతె మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్, నాయకులు బోరెం రాజేశ్వర్, లింగం, కన్నయ్య, కనకయ్య, రవి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముళ్ల పొదలు తొలగింపు


ముళ్ల పొదలను తొలగిస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

జోగిపేట(అందోల్): సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'మలుపుల్లో–మృత్యుఘంటికలు' అనే కథనంపై నేషనల్ హైవే అధికారులు స్పందించి అన్నాసాగర్ చెరువు కట్టకు ఇరువైపులా ఉన్న ముళ్ల పొదళ్లను సోమవారం తొలగించారు. నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్ మధుసూదన్‌రావు ఆదేశాలు మేరకు జేసీబీ సాయంతో పనులు చేపట్టారు. అన్నాసాగర్ పెద్ద చెరువు కట్టకు ఇరువైపులా మలుపుల్లో పెద్ద పెద్దగా ముళ్ల చెట్లు పెరగడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. **ఈ విషయం సాక్షి దినపత్రికలో ప్రచురితం కావడంతో అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు.**

కంకర క్రషర్‌లలో తనిఖీలు


కంకర క్రషర్‌లలో పర్యటిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని మాదారం, రాళ్ల కత్వ గ్రామాల్లో కంకర క్రషర్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో 'సాక్షి'లో 'అడ్డగోలుగా పేల్చేస్తుండ్రు' అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే.దీనిపై స్పందించిన పీసీబీ అధికారులు అజయ్ సిబ్బందితో కలిసి సోమవారం మాదారంలోని కంకర క్రషర్‌లలో తనిఖీలు చేపట్టారు. వాయు కాలుష్యంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రజలు అధికారులకు వివరించారు. కంకర క్రషర్‌లపై పూర్తి స్థాయి విచారణ చేపడుతున్నామని, నిబంధనలు పాటించని క్రషర్‌ల యాజమాన్యాలకు నోటీసులు అందిస్తామని అధికారులు తెలిపారు. ఉన్నతాధికారులకు పూర్తి నివేదికలు అందిస్తామన్నారు.

గుట్కా ప్యాకెట్లు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గుట్కా ప్యాకెట్లు

వర్గల్(గజ్వేల్): టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుట్కాప్యాకెట్లు స్వాధీనం చేసుకున్న ఘటన వర్గల్ మండలం గౌరారంలో సోమవారం చోటు చేసుకుంది. సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ జానకీరాంరెడ్డి, గౌరారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గౌరారంలోని డీ.మహేశ్ కుమార్ కిరాణా దుకాణంలో వివిధ రకాల ప్రభుత్వ నిషేధిత గుట్కా ప్యాకెట్లు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ బృందం, గౌరారం పోలీసులు కిరాణ దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. రూ.50,000 విలువైన గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చోరీల దొంగ అరెస్టు

శివ్వంపేట, తూప్రాన్: పట్టపగలే ఇంట్లో చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తూప్రాన్ సీఐ రంగకృష్ణ తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలు సీఐ కార్యాలయంలో వెల్లడించారు. బుధవారం శివ్వంపేట మండల పరిధి సికింద్లాపూర్ గ్రామంలో దొంటికే మహేశ్ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. గోమారం వద్ద సోమవారం పోలీసులు వాహనాల తనిఖీ చేస్తున్న క్రమంలో జీడిమెట్ల ప్రాంతానికి చెందిన కల్లే మహేశ్ అనుమానాస్పద స్థితిలో కనిపించాడు. వెంటనే అదుపులోకి తీసుకొని విచారించగా చోరీ విషయం వెలుగులోకి వచ్చింది. చోరీ చేసిన 9 తులాల బంగారు ఆభరణాలతోపాటు రూ.1,000 స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సమావేశంలో ఎస్ఐ మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

భవనంపై నుంచి పడిపోయిన విద్యార్థిని

- తీవ్ర గాయాలు, విరిగిన కాలు
- గురుకుల పాఠశాలలో ఘటన
- వెనుక నుంచి తనను తోసేసినట్లు చెబుతున్న బాధితురాలు


హాస్టల్ భవనం పైన పరిశీలిస్తున్న సీఐ


గాయపడిన విద్యార్థిని

రాయికోడ్(అందోల్): రెండస్తుల భవనంపై నుంచి ఓ విద్యార్థిని పడిపోవడంతో కాలు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం రాయికోడ్ మండలం యూసుఫ్‌పూర్‌లో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన మల్లీశ్వరి అల్లాపూర్ శివారులోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. సమ్మర్ హాలిడేస్ అనంతరం అనారోగ్యం కారణంగా జూన్ 22న తిరిగి పాఠశాలకు వచ్చి అక్కడే హాస్టల్‌లో ఉంటోంది. ఈ క్రమంలో సోమవారం ఉదయం హాస్టల్‌లోని మొదటి అంతస్తులోని తన గది నుంచి తోటి విద్యార్థినులతో కలిసి అల్పాహారం కోసం కిందున్న భోజన గదికి వస్తోంది. ఆ సమయంలో తిరిగి పైకి వెళ్లింది. రెండో అంతస్తుకు వెళ్లిన మల్లీశ్వరి అక్కడి నుంచి కిందపడిపోయింది. మరో విద్యార్థిని తోడుగా పైకి రమ్మని చెబితే పైకి వెళ్లానని, తనను వెనుక నుంచి మరో విద్యార్థిని తోసివేయగా కిందపడినట్లు వివరిస్తోంది. తీవ్ర గాయాల పాలై గట్టిగా కేకలు వేయగా పలువురు బాలికల ద్వారా విషయం తెలుసుకున్న టీచర్లు చికిత్స నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుడి కాలు విరిగినట్లు, వెన్నుముకకు తీవ్ర గాయమైనట్లు గుర్తించిన డాక్టర్లు మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డికి రిఫర్ చేశారు. సంగారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినికి కాలు విరగడంతోపాటు వెన్నుముకకు శస్త్రచికిత్స అవసరమని డాక్టర్లు తెలిపినట్లు కుటుంబీకులు చెప్పారు. తనను మరో విద్యార్థిని కిందకు తోసేసినట్లు చెప్పగా బాలికలను విచారించగా అలాంటి సమాచారం తమకు రాలేదని ప్రిన్సిపాల్ మాన్విచంద్ వివరించారు. ఘనటపై ఆర్‌సీఓ బీమయ్య, జహీరాబాద్ రూరల్ సీఐ నయిమోద్దీన్, రెవెన్యూ అధికారులు వేర్వేరుగా వివరాలు సేకరించారు. బాధిత విద్యార్థిని తెలిపిన వివరాలపై ఉన్నతాధికారులు లోతుగా విచారిస్తే వాస్తవాలు వెలుగులోకి రానున్నాయి.

వైద్య ఖర్చులు గురుకుల యాజమాన్యం భరించాలి

సంగారెడ్డి టౌన్: రాయికోడ్ గురుకుల పాఠశాలలో చూస్తున్న పదవ తరగతి మల్లేశ్వరి విద్యార్థిని ప్రమాదవశాత్తు భవనం పైనుండి కింద పడిందని సోమవారం సంగారెడ్డి లోని బాలాజీ హాస్పిటల్ కు చికిత్స పొందుతున్న ఆమెకు ఎస్ఎఫ్ఐ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ చికిత్స పొందుతున్న విద్యార్థి కుటుంబానికి గురుకుల యాజమాన్యం పూర్తి బాధ్యత వహించాలని నిర్లక్ష్యం వహిస్తున్న గురుకుల ప్రిన్సిపాల్‌ని వెంటనే సస్పెండ్ చేయాలన్నారు.

కూతురు ప్రేమ వివాహం

మనోవేదనకు గురై తండ్రి ఆత్మహత్య

దుబ్బాకరూరల్: కూతురు ప్రేమ వివాహం చేసుకోవడంతో మనోవేదనకు గురైన తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని అచ్చుమాయిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ గంగరాజ్ కథనం మేరకు.. సోమారపు లింగం(42) ఆదివారం పొలం వద్ద తుకానికి నీళ్లు పెడుతానని వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. రాత్రి పొలం వద్దకు వెళ్లి చూడగా చెట్టుకు ఉరి వేసుకొని కనిపించాడు. కూతురు ప్రేమ వివాహం చేసుకోవడంతో మానసికంగా కుంగిపోయి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. సోమవారం మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరి వేసుకొని వ్యక్తి..

దుబ్బాకరూరల్: ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండంలోని ఆకారం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ గంగరాజ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన భాస్కర్(26) ఆదివారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం మధ్యాహ్నం గ్రామ శివారులోని చెట్టుకు ఉరి వేసుకొని కనిపించాడు. మృతుకి గల కారణాలు తెలియరాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు..

చిన్నశంకరంపేట(మెదక్): ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన నార్సింగి మండలం శేరిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. శేరిపల్లి గ్రామానికి చెందిన నాగులగారి(టైలర్) మహేశ్ గౌడ్ (40) సోమవారం సాయంత్రం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కాలేజీపై చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం


కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సిద్దిపేటరూరల్: ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు ఆస్పత్రి బారిన పడేలా వ్యవహరించిన సురభి మెడికల్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ మాట్లాడుతూ.. లక్షల్లో ఫీజులు తీసుకుంటూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టకుండా సురభి మెడికల్ కళాశాల యాజమాన్యం విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. కళాశాలలో సరైన వసతులు, అసంపూర్తి నిర్మాణంతో కళాశాలను నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంజిత్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సంజీవ్, జిల్లా నాయకులు సంతోష్, భరత్ కుమార్, అభినవ్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి మృత్యువాత

కల్హేర్(నారాయణఖేడ్): చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. సిర్గాపూర్ ఎస్ఐ మహిపాల్‌రెడ్డి కథనం మేరకు.. సిర్గాపూర్ మండలం అంతర్‌గాంకు చెందిన తోంటోల్ల సుభాష్ (30) ఆదివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. ఇంటి నుంచి వెళ్లిన సుభాష్ సోమవారం గ్రామ సమీపంలోని తంబల వాగులో శవమై కనిపించాడు. చేపలు పట్టేందుకు వెళ్లి కరెంట్ షాక్‌తో మృతి చెంది ఉంటాడని మృతుడి తండ్రి రాములు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి..

అక్కన్నపేట(హుస్నాబాద్): విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన అక్కన్నపేట మండలం పంతుల్‌తండా గ్రామ పరిధిలోని హేంసింగ్ తండాలో చోటుచే సుకుంది. స్థానికుల కథనం మేరకు.. తండాకు చెందిన భూక్య శివలాల్(50) అనే రైతు వ్యవసాయ బావి వద్ద స్టార్టర్‌లో పనులు చేస్తుండగా ఒక్కసారిగా కరెంట్ షాక్ కొట్టి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య దేవి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. శివలాల్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామ మాజీ సర్పంచ్ భూక్య అశ్వీనిహేము, బీజేపీ పార్టీ గిరిజన మోర్చా నాయకులు రైనా నాయక్, కాంగ్రెస్ గిరిజన సెల్ మండలాధ్యక్షుడు కరంటోతు రవి, తండావాసులు, యువకులు కోరుతున్నారు.

వాహనం అదుపుతప్పి పడిపోవడంతో..

మిరుదొడ్డి(దుబ్బాక): టీవీఎస్ ఎక్సెల్ అదుపుతప్పి కిందపడటంతో వ్యక్తి మృతి చెందిన ఘటన అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. భూంపల్లి ఎస్ఐ హరీశ్‌గౌడ్ కథనం మేరకు.. మండల పరిధిలోని పోతారెడ్డి పేటకు చెందిన ఎర్రోల్ల కిష్టయ్య (45) డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం మండల పరిధిలోని రుద్రారంలో ఉంటున్న బంధువుల వద్దకు టీవీఎస్ ఎక్సెల్ పై వెళ్లాడు. మధ్యాహ్నం తిరిగి పోతారెడ్డి పేటకు వస్తున్న క్రమంలో అక్బర్‌పేట సమీపంలో బండి అదుపుతప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో కిష్టయ్యకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య రాజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.